
నూరేళ్ళ తెలుగు కథకు నవ్య నీరాజనం - 50



# రచన, నటన నాన్నగారి ఉచ్ఛ్వాస నిశ్వాసలు

**- శ్రీమతి పెన్మత్స లలితావాశిష్ఠ**

కళాప్రపూర్ణ డా. గణపతిరాజు అచ్యుతరామరాజు మంచి కథా రచయిత, రంగస్థల ప్రేమికుడు, నటుడు, నాటక రచయిత, దర్శకుడు. అన్నింటికీ మించి అద్భుతమైన వాగ్ధాటితో అనర్గళంగా ఎంతసేపైనా ప్రేక్షకుల్ని మంత్ర ముగ్ధుల్ని చేసి మాట్లాడగల మంచి వక్త. ఆ కాలంలో సాటి రచయితలకు గౌరవనీయులు, యువ రచయితలకు ఆదర్శప్రాయులు. ఆ బహుముఖ ప్రజ్ఞాశాలి కుమార్తె శ్రీమతి పెన్మత్స లలితా వాశిష్ఠ కూడా కవయిత్రి, రచయిత్రి. నాన్నగారి గురించి ఆమె జ్ఞాపకాలు ఈ వారం 'నవ్య' పాఠకుల కోసం...



అల్లుడు, కొడుకు, కోడలు, కూతురుతో రామరాజు దంపతులు

### బాల్యం సునాయాస జీవనం

మాది మధ్యతరగతి కుటుంబమే అయినా మా నాన్నగారి బాల్యంలో గానీ, నా చిన్ననాటగానీ ఆర్థిక ఇబ్బందులు పెద్దగా లేవు. మా అమ్మ ఒక జమీందారీ కుటుంబం నుంచి వచ్చారు. నాన్నగారి బంధువుల అమ్మాయే! దగ్గరి సంబంధమే! పెళ్ళయిన తరువాత అమ్మ జమీందారినీ విడిచి మా మధ్య తరగతి కుటుంబంలో ఇమిడిపోయింది. నా భవిష్యత్తులో అది నాకు స్ఫూర్తిగా నిలిచి పెద్ద కుటుంబంలో అణుకువతో ఉన్న కోడలిగా మసలగలిగాను, మన్ననలు పొందాను.

### సాహితీ సమావేశాలు – సత్కాలక్షేపాలు

ఇంట్లో ఎప్పుడూ సాహితీ సమావేశాలు జరుగుతుండేవి. అప్పటికి లబ్ధ ప్రతిష్టులైన రచయితలు, యువ రచయితలు, నటులు, పండితులతో నిత్యం చర్చలు జరుపుతుండే వారు. నేరెళ్ల వేణుమాధవ్, బాపు, బాలి వంటి ప్రముఖులు వచ్చి పోతుండే వారు. మా ఇంటి తలుపులు రాత్రి 11 గంటల నుండి తెల్లవారుజాము 4 గంటల వరకే మూసి ఉండేవి. మిగతా సమయమంతా సాహితీవేత్తలతో చర్చలతో సత్కాలక్షేపం జరిగేది. రచయితతో పాటు నాన్నగారు పేరున్న క్రిమినల్ లాయర్ కావడంతో క్లయింట్లతో కూడా బిజీగా ఉండేవారు.

### ఆది గురువులు

అమ్మ రామలక్ష్మీనరసయ్యమ్మ చదివినది మూడో క్లాసే! పూలదండలో దారానికి తావి అబ్బినట్లు నాన్నగారి సాహచర్యంలో అమ్మ ఖాళీ సమయంలో వ్యాస పీఠం మీద రామాయణ, మహాభారత, భాగవత గ్రంథాలను పెట్టుకుని ఔపోసన పట్టేవారు. అమ్మగారి ఊరిలోని స్వంత రామాలయంలో విన్న సంగీత సాహిత్యాలను అప్పటికే వారు జీర్ణించుకున్నారు. కాబట్టి పురాణాల్లోని సందేహాలకు సముచితరీతిలో సమాధానాలు చెప్పి నన్ను తృప్తిపరచేవారు. కాబట్టి అమ్మానాన్నలే నాకు ఆది గురువులని చెప్పొచ్చు.

### ముందు మాటలకు ప్రాధాన్యం

నాన్నగారు స్వంత రచనల కంటే చాలామంది ప్రముఖుల, అప్పటి యువరచయితల పుస్తకాలకు పీఠికలు రాయడానికే ప్రాధాన్యం ఇచ్చే వారు. రచయితలు తమ పుస్తకానికి ముందు మాట రాయమని అడిగితే నాన్నగారు ఎప్పుడూ తిరస్కరించేవారు కారు. ఏ పుస్తకం అయినా సొంతం చదవందే 'మున్నుడి' రాసే వారు కారు.

### సినిమా రంగంతో పరిచయం

నాన్నగారు కీలక పాత్రలో వారి కథ 'కసి' ఆధారంగా 'ఆడదే ఆధారం' అనే పేరుతో సినిమా ప్రారంభించారు. హీరోగా హరనాథ్, ఉప కథానాయకుడుగా మా వారు జగన్నాధరాజు ఎఎస్‌రాజా దర్శకత్వంలో 13 రీళ్లు షూటింగ్ కూడా పూర్తయింది. ఏవో కారణాల వల్ల మిగిలిన సినిమా పూర్తి కాలేదు.

### నిరంతరం హాస్యోక్తులు

ఎంతటి క్లిష్ట పరిస్థితుల్లోనైనా ఆహ్లాదకర వాతావరణం కోరుకునేవారు. ఆ సినిమాలో నటిస్తూ నాన్న పడిపోయి కాలు విరగ్గొట్టుకున్నారు. పరామర్శించడానికి వచ్చిన ఒక ప్రముఖ రచయితతో నాన్నగారు మాట్లాడుతూ 'రావి శాస్త్రి కలం అతన్ని కారాగారానికి పంపింది. నా కలం నా కాలు విరగ్గొట్టింది' అని వ్యాఖ్యానించారు. ఆపరేషన్ చేసి కాలికి స్టీల్‌రాడ్ వేస్తే. బంధుమిత్రులతో 'I am man of Steel' (నేను ఉక్కుమనిషిని) అని చమత్కరించేవారు.

### 'విశాఖ సాహితి'తో 32 సంవత్సరాల అనుబంధం

'విశాఖ సాహితి' స్థాపన నుంచి 32 సంవత్సరాలు నిర్విఘ్నంగా అధ్యక్ష స్థానంలో ఉండి నడిపించారు. ఆ సాహితీ సమావేశాల వివరాలు వార్తా పత్రికల్లో వస్తే వాటిని కత్తిరించి భద్రపరచి నాన్నగారికి ఇచ్చేదాన్ని. ఆయన నా ఆసక్తిని మెచ్చుకునేవారు. అనంతరం అనారోగ్య రీత్యా విశ్రాంతి అవసరమైనప్పుడు 'విశాఖ సాహితి'కి 'ఆచార్య కోలవెన్ను మలయ వాసిని' గారిని అధ్యక్షులుగా నియమించి, గౌరవాధ్యక్షులుగా నాన్నగారు బతికి ఉన్నంతవరకూ కొనసాగారు. జంపన కుమార వర్మ కార్యదక్షతతో ఇప్పటికీ ఆ సంస్థ సాహితీ, సదస్సులు వారం వారం జరుగుతున్నాయి. నేనూ ''విశాఖ సాహితి'కి రానా?'' అని అడిగి నప్పుడల్లా 'నువ్వు రచయిత్రివి అయితే నిన్ను సంస్థకు తప్పకుండా పరిచయం చేస్తాను' అనే వారు.

### కథలు రాయాలనే కోరిక

ఆ మాటే నాలో కథలు రాయాలన్న కోరిక కలిగించింది. 'శిరీష మంజరి' అన్న కలం పేరుతో కొన్ని కథలు రాసి నాన్నగారికి చూపించాను. వారు అవి పరిశీలిస్తున్న సమయంలో ఒక పత్రికా సంపాదకుడు వచ్చి 'ఈ కథలు ఎవరివి?' అని అడిగారు. 'మీరు చదివి బాగున్నాయో లేవో చెప్పండి!'' అని వాటిని ఆ ఎడిటరుకి ఇచ్చారు. ఆయన వాటిని చదివి 'బాగున్నాయి. నాకు ఇస్తారా? నా పత్రికలో వేసుకుంటానని అడిగితే ఇచ్చారు. ఆ కథలకు ప్రశంసలు వచ్చాక నన్ను ఒక సమావేశానికి తీసుకెళ్లి 'శిరీష మంజరి' నా కుమార్తె అని గర్వంతో ఆనందంతో పరిచయం చేశారు.

### నటునితో పెళ్లి వద్దు

నాటక రంగంపై ప్రేమ, నటనానుభవం ఉన్న నాన్నగారు అప్పటికి ప్రసిద్ధ రంగస్థల నటులైన జగన్నాధరాజు (రాంబాబు) గారికి నన్ను ఇచ్చి పెళ్లి చేయాలనుకున్నారు. ఇతను అప్పటికే 'మరో మొహం జదారో', 'తాజ్' తదితర నాటకాల్లో నటించి ఉత్తమనటునిగా బహుమతులు పొందిన కళాకారుడు. నాన్నగారి అభిప్రాయాన్ని అమ్మ వ్యతిరేకించి 'నటునితో పెళ్లి' వద్దు అంది. అయినా నాన్న నిర్ణయమే నెగ్గింది.



కూతురు, అల్లుడు, మనవరాలితో...

జగన్నాధరాజు గారి భార్యనయ్యాను.

## నా ఇల్లే నాకు గ్రంథాలయం

నాన్నగారు చదివే అనేక తెలుగు, ఆంగ్ల గ్రంథాలతో పాటు ప్రపంచ సాహిత్యంతో మా ఇంట్లో పెద్ద గ్రంథాలయం ఉండేది. ఆ సాహిత్యంతో పరిచయం ఏర్పడి పుస్తక పఠనం పట్ల మక్కువ పెంచింది. అంతర్జాతీయ సాహిత్యాన్ని చదివే భాగ్యం నాకు నా పుట్టింట్లోని పుస్తకాలతో కలిగింది. పెళ్లయిన ఏడేళ్ల తరువాత పిల్లల చదువుల కోసం వేరు కాపురం పెట్టాల్సి వచ్చింది. అప్పుడు నాన్నగారు మళ్లీ నాకు తాను చదివిన పుస్తకాలు ఇచ్చి చదివిన తరువాత వెంటనే తిరిగి ఇచ్చేయమనే వారు. అప్పుడు నాకు మళ్లీ పుస్తకం విలువ తెలిసింది.

## కలం కాగితాలతో నిరంతర పయనం

గాజువాకలో మా దంపతులం కాపురం పెట్టినప్పుడు నాన్నగారిని చూడ్డానికి విశాఖపట్నం టౌనుకు వెళితే ఎప్పుడూ రాస్తూనో, ఎవరో సాహితీవేత్తలు, క్లయింట్‌లతో చర్చిస్తూనో ఉండేవారు. ఆయన దర్శన భాగ్యమే కలిగేది కాదు. ఉడుక్కుని ఇంటికి వచ్చేసేదాన్ని. ఆయన మా ఇంటికి వచ్చినా బ్యాగ్‌లో నిండా కాగితాలు, పెన్ను ఒక లుంగీ మాత్రమే తెచ్చుకునే వారు. నిరంతరం రాసుకుంటూనే ఉండే వారు. నా తీరిక సమయంలో 'ఇవి చదవమ్మా' అని ఇచ్చేవారు. నేను చదివి వాటిల్లోని సంస్కృత పదాలకు అర్థం చెప్పించుకునేదాన్ని. అలా ఆయన సదా రాస్తుండడం మా ఇంటి చుట్టుపక్కల వాళ్లు చూసి 'ఇదేమిటని?' ప్రశ్నిస్తే 'నాన్నగారు రాయకుండా ఉండలేరని' బదులిచ్చే దాన్ని. ఆయన గొంతు కేన్సర్‌తో బాధపడుతూ రేడియో థెరపీ తీసుకుంటున్నప్పుడు ఆసుపత్రి రూమ్‌లో ఉండి కూడా వ్యాసాలు రాస్తుండేవారు. 'ఇక్కడ కూడా ఎందుకు బాజీ?' (నాన్నగారిని అలా పిలిచేదాన్ని) అంటే వైద్యులు వాళ్ల పని వాళ్లు చేస్తుంటారు. నేను నా పని చేసుకుంటున్నానని నవ్వేవారు. అలా రాసిన వ్యాసాలు ఎక్కువ ఒక ఆంగ్ల దినపత్రికలో అచ్చుయ్యేవి.

## నా కోసం హిందీ సినిమాలు చూసేవారు

ఆయన ఎప్పుడూ తీరికలేని మనిషే. పోరగా పోరగా ఎప్పుడైనా మమ్మల్ని సినిమాకు తీసుకు వెళ్లేవారు. బాల్కనీ బాక్సులో మేం మాత్రమే ఉండేవాళ్లం. నేనెంతో ఆనందించేదాన్ని. నా కోసం బలవంతంగా హిందీ సినిమాలకు వచ్చేవారు. అది నాకెంతో గొప్పగా ఉండి మర్నాడు స్కూల్లో చెప్పుకునేదాన్ని. మా స్కూల్లో టీచర్లందరికీ మా నాన్నగారు తెలియడం వల్ల నన్ను అపురూపంగా చూసుకునే వారు.

## నాన్నగారిది సాహిత్య కుటుంబం

నాన్నగారి సోదరులందరూ (చిన్నాన్నలు) సాహిత్యంతో పరిచయం ఉన్నవారే!

వారిలో నరసింహారాజుగారు 'కీర్తిప్రియ' అన్న కలం పేరు తోనూ, ఆఖరి చిన్నాన్న ఈశ్వరవర్మ 'హిమశంకర్' కలం పేరుతోనూ రచనలు చేస్తున్నారు.

## ప్రతి జయంతి నాడు ఒక పుస్తకావిష్కరణ

సాంబమూర్తిరాజు, ఛాయాభాస్కరమ్మ దంపతులకు కలిగిన ఎనిమిది మంది సంతానంలో మూడవ వారు నాన్నగారు. 1924 మార్చి 5న పుట్టారు. 10-6-2004న కాలం చేశారు. ఆయన పోయాక నాన్నగారి ప్రతి జయంతి రోజున (మార్చి 5) నేను రాసిన ఒక కవితా సంపుటినో, కథా సంపుటినో అచ్చేసి ఓ సాహితీసభ (ఒక విధంగా నాన్నగారి సంస్మరణ సభ) జరిపి ఆ పుస్తకాన్ని నాన్నగారికి అంకితమిస్తున్నాను. మా శ్రీవారు కూడా నాన్నగారి అభిమాని గనుక నా రచనలు ప్రచురించ డానికీ ఈ సభలు నిర్వహించడానికీ సహృదయంతో సహకరిస్తూ నన్ను ప్రోత్సహిస్తున్నారు.

## సేవలు


ఆంధ్ర, వేంకటేశ్వర విశ్వవిద్యాలయాల్లో సెనేటర్‌గా, ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యునిగా, ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ, లలిత కళా అకాడమీ, సాహిత్య అకాడమీలలో ప్రముఖ సభ్యునిగా సేవలందించారు.

## ముఖ్యమైన రచనలు

ఆనందహేల (కవిత), శిఖానఖ పర్యంతం (కవిత), వినాయకుడి పెళ్లి, బ్రహ్మముడి (నాటకాలు) ఖడ్గతిక్కన, మాలిని, తీర్పు, చిన్నపిల్లలు, ఇంకానా ఇకపై సాగవు, టైగర్ మున్నగు నాటికలు అనేక రేడియో ప్రసంగాలు, అసంఖ్యాక వ్యాసాలు, పదుల్లో కథలూ, వందల్లో పీఠికలూ రాశారు. 'మున్నీ' కథల సంపుటిని విశాఖ మొదటి మేయరు ఎన్.ఎస్. ఎన్.రెడ్డికి అంకితమిచ్చారు.

## మా నాన్నగారికి ఇష్టమైనవి

| | | |
|---|---|---|
| 1. | సినిమా | : గుండమ్మకథ, మాయాబజార్ |
| 2. | సినిమా నటి | : సావిత్రి |
| 3. | సినిమా నటుడు | : యస్వీ రంగారావు |
| 4. | పిండి వంటలు | : తీపి మిఠాయిలు ఏవైనా |
| 5. | గాయకుడు | : ఘంటసాల |
| 6. | స్నేహితుడు | : జె.వి.సోమయాజులు |
| 7. | పని | : రాస్తూ ఉండటం, చదువుతూ ఉండడం |
| 8. | కథ | : కలుపు మొక్కలు |
| 9. | రచయిత | : శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి |
| 10. | హాబీ | : రంగస్థలంపై నటించడం |
| 11. | పాట | : సాహిత్యం గుబాళించే అన్నిపాటలూ |



మనవడు, మనవరాలితో...

## స్నేహశీలి

నటుడు జె.వి.సోమయాజులు (శంకరాభరణం) గారితో నాన్నగారికి బాగా పరిచయం. సోమయాజులు గారి అకాల మరణం నాన్నగారిని బాగా కుంగదీసింది. ప్రముఖ రంగస్థల, సినీ నటులు దర్శకులు 'అమ్మ సంస్కృతి సంస్థాన్ ట్రస్ట్' వ్యవస్థాపకులు 'రావూజీ' గారికి ఆ పేరు నాన్నగారే పెట్టారు. అతని పేరు 'అప్పారావు', నాన్నగారికంటే చిన్న వారు గనుక 'రావుగారు' అని సంబోధించడం అంత నచ్చక 'రావూజీ' అని పిలిచి దాన్ని శాశ్వతం చేశారు.

## నాన్నగారి ఆశయం

నాన్నగారి చివరి రోజుల్లో ఆయన్ని అంటి పెట్టుకునే ఉన్నాను. విశాఖ సాహితీ సామ్రాజ్యానికి రారాజుగా వెలిగిన అచ్యుతరామరాజుని అనారోగ్య స్థితిలో చూడడం దురదృష్టమైతే, నా చేతుల్లో వారి ప్రాణాలు పంచభూతాల్లో కలిసిపోవడం కొంతలో కొంత తృప్తినిస్తుంది. ప్రతి మనిషిలోనూ ఒక 'కథకుడు' ఉంటాడు. తనలోని ఆ కథను కాగితం మీద పెట్టగలిగిన వారు రచయితలౌతారు. ఎంత ఎక్కువగా చదివితే అంత బాగా రాయొచ్చు. తెలుగుభాష తెలిసిన ప్రతి ఒక్కరూ ముఖ్యంగా 'యువత' కలం పట్టాలి. తమలోని సృజనాత్మకతను వెలికితీసి సమాజానికి మంచి రచనలు అందించి తెలుగువారి ఖ్యాతిని దశదిశలా వ్యాపింప చేయాలన్నది నాన్నగారి ఆశయం.

-మేడా మస్తాన్‌రెడ్డి

## నాకు నచ్చిన మా నాన్న కథ

# కసి

**- గణపతిరాజు అచ్యుతరామరాజు**

**ఊరికి ఉత్తరానున్న రాదారి బంగళా వెనకవైపు రెండో వాసలో ఉన్న తాటాకుల యిళ్ళ కొప్పుమీద కునక బోతున్న చంద్రుడు మసకమసకగా ఉన్నాడు.**

**ఆ రెండో వాసలో ఉన్న తాటాకు మిద్దె యింటి మధ్య గదికి తూర్పు గడపలో, ఓ మూలనున్న హరికేను లాంతరు గుప్పుగుప్పుమని కునక బోతూంది. ఆ పక్కనే ఉన్న కుక్కి ఈజీచేరులో కునికీడానికి సిద్ధంగా ఉన్న కాంతం నరికిన దేవదారు మొక్కలా ఉంది.**

**ఆ మధ్య గది గడప యివతల ముంగిట్లో గడకర్రలా నించున్న అర్జయ్య ఒక్కసారిగా తేరుకొని గడపలో కుక్కి ఈజీచేరులో పడివున్న కాంతం దగ్గరకి గబగబా వెళ్ళి నందిట్లోకి పట్టుకొని వెక్కివెక్కి ఏడుస్తూ ఆవిడ ముఖం మీద ముద్దులు పెట్టుకొంటూండగా అతని చేతులు చల్లబడ్డాయి. పెదవులు తుడిచేసుకొని గుండెమీద బనీనుకు రాసుకోబోతే బనీను కూడా చల్లగా తగిలింది. ఆ ఈజీచేరు ముందుని తన కాళ్లకింద కూడా చల్లగా ఏదోతగిలింది. అదంతా చచ్చిపోడానికి సిద్ధంగా వున్న ''కాంతం'' రక్తం.**

కాంతం ముఖం మీద నీళ్ళు చల్లితే...

ఆ వరండా గడపలో నీళ్లతో చెంబుగాని బాల్చీగాని లేదు. ఆ గడపకు రెండో మూలనున్న రేకు తలుపు తోసుకొని అర్జయ్య గదిలోకి వెళ్లేడు. ఆ గదంతా చిందరవందరగా ఉంది. నాలుగయిదు పేకేజీ పెట్టె చెక్కలు విరిగి పోయి ఉన్నాయి. ఓ సరుగుడు కర్ర పేడు అడ్డంగా పడివుంది. కిరసనాయిలు ''స్టౌ'' యింకా వెలుగుతూ వుంది. బర్నర్ మీదుండే మూత ఓ పక్కను దొర్లిపోయి వున్నది. స్టౌ పక్కనే మాసిన ఓ తెల్ల లంగా. ఓ ఆకుపచ్చ చీరముక్కా పడి వున్నాయి. అప్పుడే ఒక పదిహేను నిమిషాల క్రితం తాను చేసిన మహా ఘోరమైన పనికి నిదర్శనాల క్రింద అవన్నీ అలా పడివున్నాయ్.

ఓ పావుగంట క్రితం ఆ పేకేజీ చెక్కల్తో కాంతాన్ని తలమీదా, చేతుల మీదా, జెబ్బలమీదా, కాళ్ళమీదా, తొడలమీదా, వీపుమీదా ఏమీ కాకుండా చితకబాదేడు. ఆ చెక్కలు చెక్కలైపోయాయి. మూలనున్న సరుగుడు పేడు తీసేసరికి కాంతం యింటిపక్క సందులోకి పరుగెత్తింది. దాని వెనకాతలే సర్రున పరుగెత్తుకెళ్లి దాని కొప్పు దొరకపుచ్చుకొని యింట్లోకి బరబరా ఈడ్చుకొని వచ్చి సరుగుడు పేడుతో నెత్తి మీద కసి తీరా ఒకటి కొట్టేసరికి ఆరో నెల కడుపుతో వున్న కాంతం మొదలంటూ నరికిన దేవదారు మొక్కలా కుప్పకూలిపోయింది.

అప్పటికీ తన కసి తీరలేదు. తాను వచ్చేనని తెలియగానే టీ కాయడానికి నీళ్ళు మరగబెట్టడానికి కాంతం వెలిగించిన కిరసనాయిల్ స్టౌ యింకా వెలుగుతోంది. స్టౌ మీద కప్పు బాగా కాలి మరిగి ఉంటుంది. ఆ కప్పుతో దానికి వాతలు పెడితేనేగాని దానికి బుద్ధిరాదు. తన కసి తీరదు. వెంటనే దాని చీర చెంగు లాగి పారేశాడు. లంగా ఊడబీకేసేడు. బర్నర్ మీద కప్పుతో దాని తొడల్లో పలా రొమ్ము మీదా, పొట్ట మీదా వాతలు వేసేసేడు.

తానింత చేసినా కాంతానికేం లక్ష్యం లేదే! బావా! నేనేం తప్పు చెయ్యలేదు. తప్పు చెయ్యలేదనడమే తప్ప మరో మాట అనలేదే!


ఆ గదిలో దక్షిణం వైపు గడ్డిపరుపు వేసివున్న నులకమంచం కింద ఓ కుండా, ప్లాస్టిక్ గ్లాసూ, కత్తి పీటా, ఓ రేకు ట్రంకుపెట్టె వున్నాయి. ఆ నీళ్ళ కుండా ప్లాస్టిక్ గ్లాసూ పైకి మోసుకొని వస్తూ తూర్పువేపు గోడకున్న కర్ర ఫ్రేము అద్దంలో స్టౌ వెలుతుర్లో తనను తాను అర్జయ్య చూసుకుంటే తానెంత మసక మసకగా ఉన్నాడు. ఘోరంగా వున్నాడు.

గడపలోకి వచ్చి కుండలో నీళ్ళు ప్లాస్టిక్ గ్లాసుతో తీసి కాంతం మొఖం మీద నీళ్ళు జల్లేడు. కాంతం యింకా మూలుగుతూనే వుంది. దానికింకా స్పృహ రాలేదు. ''బావా! నేనేం తప్పు చెయ్యలేదు. నేనే పాపఁవూ ఎరగను'' అని యింకా అది మొరపెట్టుకొంటున్నట్లే దాని మూలుగులు వినబడుతున్నాయి.

అర్జయ్య అనుకున్నాడు.

నిజంగా యిదే పాపఁవూ ఎరగదా? దాని కడుపులో పిల్ల తన సంతానమేనా? ఆ లారీ బ్రోకరుగాడితో నలభై ఏళ్ళొచ్చినా యీ ముండ ఎందుకంత

### నాకిష్టమైన నాన్నగారి కథ



మా నాన్నగారి కథలన్నీ బాగుంటాయి. ఎక్కువ రాయలేదు కాబట్టి నేను అన్నీ చదివాను. కానీ ఈ 'కసి' చదివినప్పుడల్లా నాకు ఈ కథలోని పాత్రల మీద కోపం రాదు. సమాజం మీద 'కసి' పుడుతుంది. ముల్లు - అరిటాకు నానుడిని నిజం చేస్తూ ఆడదాని జీవితం ఎలా దయనీయంగా అర్థాంతరంగా ముగుస్తుందో నాన్నగారు రాశారు. ఈ కథ, ఎన్నిమార్లు చదివినా అన్నిసార్లూ నా కంట్లో నీరు బయటకు దూకుతుంది. సంఘంలో మగవాడు చేసే అకృత్యాలకు ఆడది బలికావడం అనాదిగా జరుగుతున్న ఆచారం. ఇది అనాచారమని ఏ ఒక్క పురుష పుంగవుడయినా గుర్తించి తన ప్రవర్తనను మార్చుకున్నా ఆడవారి జీవితాలు పూలబాటలౌతాయి.

**-పి.లలితావాశిష్ఠ**


పూసుకొని మాట్లాడాల యిన్నాళ్ళూ? పది రోజులపాటు కేరళకి లారీలమీద బియ్యం తోలుకుపోయి తిరిగి యింటికొచ్చేసరికి యీ అర్ధరాత్రి పూట యిదే పాపంవూ చెయ్యకపోతే యింటి దగ్గరెందుకు లేదు? ఎక్కడ్నుంచొస్తున్నావంటే ఎందుకు చెప్పదు? ఎక్కడెక్కడో తిరిగి యీ అర్ధరాత్రి పూట ఎందుకు రావాలి?

అసలు యీ కాంతం ముండ చరిత్ర ఏంవిటి? కట్టుకున్న మొగుణ్ణొదిలేసి తన నంటకాగిందంటే యిది పరమ పత్తిత్తు అంటే ఎవడు నమ్ముతాడు? వందె కరాల మాగాణీగల మోతుబరి నొదిలేసి వాడెంత జులాయోడైతేనేం - అంత మోతుబరి నొదిలేసి పెద్దింటిది యీ లారీ డ్రైవరును తగులుకుందుంటే యిది సామాన్యపు ఆడదా? మొగుడు జులాయోడని, తిరుగుమోతని, వాడి నొదిలేసి తనను పట్టుకుందంటేనే మొగజాతి మీద దానికెంత కసో తెలుస్తూనే వుంది. పది రోజులు తాను ఊళ్ళో లేకపోతే తనమీద కసికొద్దీ దాని దానికింకో మొగుడు కావలసివచ్చేడా?


పోనీ! ఏ పాపంవూ ఎరగన్దయితే ఫలానా చోటికెళ్ళేను అని చెప్పడానికేం? రాజసమా? తామసంవా? అది చెప్పదు. అది గొప్పింటిది. పెద్దింటిది. మంచి జాతైనది మంచి నీతైనది. అయితే దానికి రాజసంవూ, తామసంవూ రెండూ వున్నాయి.....

ఈ కాంతాన్ని కట్టుకున్నాయన కామరాజుకిద్దరు అన్నలు. వీళ్ళు ముగ్గురూ వెంకటాపురంలో జమీందారుల్లా వెలిగేరు. మూడు వంద లెకరాల మాగాణి ముగ్గురూ పంచేసుకొన్నా పెద్దలోగిట్లోనే వాటాలు వేసుకొని నివాసం ఉండేవారు. ఆ తర్వాత కామరాజు పెద్దన్న వెంకట్రామయ్య గారు ఆస్తిని పెంచేసుకొని ఆ ఊళ్ళోనే పెద్ద పంచదార ఫ్యాక్టరీ కట్టుకున్నాడు.

ఆ ఫ్యాక్టరీకి నాలుగు లారీలుండేవి. పద్దెనిమిదేళ్ళ క్రిందట తానా లారీల్లో ఓ దానిమీద డ్రైవరు. వెంకట్రామయ్యగారి పెద్దలోగిటికి తూర్పుకీ ఉత్తరానికీ ఉన్న పెరళ్ళూ, ఈశాన్యం మూలనున్న నుయ్యీ తప్ప, ఆ లోగిలెంత పెద్దదో, ఆ లోగిట్లో విశేషాలేవింటో తనకి స్వయంగా తెలిసేవి కావు. ఆ పెద్దింట్లో ఏం జరిగినా అందులో మసుల్తూ పనిచేసే పాలేర్లూ, దాసీలూ అక్కడా యిక్కడా అనుకున్న దాన్నిబట్టి తప్ప తెలుసుకోవడం సాధ్యమయ్యేది కాదు తనకు. అంత హద్దుల్లో తానుండే వాడూ వాళ్ళుంచేవారూను.



అంత పెద్దింట్లో వెంకట్రామయ్య గారి మరదలుగా, కామరాజుగారి భార్యగా కాంతం అన్ని భోగభాగ్యాల్లోనూ తులతూగి ఉండాల్సింది. ఆ దీపాలు ఆ ఫేనులు, ఆ మంచాలు, ఆ పరుపులు, ఆ సోఫాలు, ఆ కుర్చీలు, ఆ బట్టలు, ఆ భోజనాలు, ఆ విందులు, ఆ అత్తరులు, ఆ పన్నీరులు. ఆ విలాసాలు ఆ యింట్లో ఆడా, పిల్లాపాపా, అంతా అనుభవించారు. కాని అంతి సిరీ సంపదా గల కుటుంబంలోకి కోడలై వచ్చి కాంతం ఏమీ సుఖపడలేదన్న సంగతి ఆవిడ తనతో



లేచి వచ్చే వరకూ తెలియనేలేదు.


కామరాజెప్పుడో గాని యిల్లు వదలి కాలుబైట పెట్టలేదు. ఆ ఇంట్లోనే అన్ని అనుభవించేవాడు. ఏడిపించే దాసీల్ని ఏడిపించేవాడు. ఒప్పుకున్న దాసీల్ని నవ్వించి సుఖపెట్టేవాడు. పరువుపోగొట్టుకున్న దాసీలు ఎవరితోనూ చెప్పుకో డానికి వీల్లేదు. చెప్పుకున్నా ప్రయోజనం లేదు.

అలాకొన్నాళ్ళు అతని సుఖాన్ని పంచుకొన్న దాసీదొకర్తె కొన్నాళ్ళకు కామ రాజు మీదే పెత్తనం చెలాయించేది. కాంతం సహించింది. అందు వల్ల కాంతం మీద కామరాజు పెత్తనం చెలాయించి దాసీదానికి తనకూ విందు భోజనాలు ఏర్పాటు చేయమనీ గ్లాసుల్లో మందుపోసి యిమ్మనీ పురమాయించేవాడు. కాంతం సహించింది. చేసి పెట్టింది. పక్కలు వేయమనేవాడు. కాంతం వేసేది. దాసీదీ తానూ పరవశించి పోతూండగా చూడమనేవాడు. చూసేది. సహిం చింది.

అప్పటికి కాంతానికి సంతానం యిద్దరే – నాలుగేళ్ళ కొడుకొకడూ రెండేళ్ళ కూతురు రాజ్యం ఒకర్తే ఆ రోజుల నాటికి. అంచేత వాళ్ళిద్దరూ అంది రాలేదు! పెద్దలైన బావగార్లూ, తోటి కోడళ్ళూ ఎవరూ తన భర్తను మందలించలేదు. కాంతాన్ని మాత్రం మహాపతివ్రత అనీ భూదేవిలా మహా ఓర్పు అయినదనీ పొగిడేవారు. అంచేత కాంతం చేయవలసిన సేవల్లో ఏదైనా ఎప్పుడైనా కొంచెం ఆలస్యం జరిగితే అప్పుడప్పుడు కామరాజు కమ్చీ పుచ్చుకొని తనని కొట్టినా ఆ దెబ్బలకి కూడా ఓర్చుకొనేది.

అయితే, ఓ రోజున దాసీదే తన మీద చెయ్యి చేసుకున్నప్పుడు ఆ పెద్దింట్లో అందరు పెద్దలూ ఊరుకోవడంతో కాంతానికి సహనం తప్పింది. అందుకని కసి కొద్దీ దారికూడా తప్పింది. ఆ యింటినీ, బావగార్లనూ, తోటికోడళ్లనూ తన పిల్ల లనూ, పెనిమిటినీ, దాసీదాన్నీ, వాళ్ళభోగభాగ్యాలనూ, తన సహనాన్నీ పతి వ్రత అన్నపేరునీ ఎడం కాల్తో తన్నేసి వాళ్ల సిరికి మోకాలడ్డు పెట్టేసి రాత్రికి రాత్రే పతిత అయిపోయింది.

ఆ రాత్రి – పద్దెనిమిదేళ్ళ క్రిందట ఓ రాత్రి కాంతమ్మగారి మీద గౌరవం కొద్దీ, జాలికొద్దీ ప్రాణాలకి తెగించి అర్జయ్య ఆవిడతోపాటు పరారీ అయి పోయాడు. కట్టుగుడ్డల్తో లేచివచ్చిన ఓ మహాపత్రివతకి దారి చూపించ డానికి ఆవిడ ''లారీ తియ్'' అనగానే తీసేసేడు. ''జోరుగా పోనియ్'' అనగానే ఫర్



మని ఎక్స్‌ప్రెస్‌లా లాగించేడు. ''లారీ ఇక్కడ వదిలేయ్'' అనగానే లారీ ఎక్కడో రోడ్డు పక్క ఒదిలేశాడు. ''నువ్వు నాతో ఒచ్చీ'' అనగానే ఆవిడతో వచ్చీసేడు – ఆ తర్వాత్తర్వాత ఆవిడే తనవెనకాతల వచ్చేసింది.

వెంకట్రామయ్య, కామరాజూ, కాంతమ్మగారి అన్నలూ, తండ్రి గారూ, తమని వెదికించి పట్టుకొని, అయిపూ పికరు లేకుండా యిద్దర్నీ కలగట్టి ఒకే గుండుతో కాల్చిపారేయ గలరన్న భయం తమ యిద్దరికీ రెండు మూడేళ్ళు లేక పోలేదు. అందులోనూ పెద్దిళ్లల్లో అఘాయిత్యాలు కాంతమ్మగారో సారి చెప్పగా తాను విన్నాడు. కాంతమ్మగారి దూరపు బంధువుల పిల్లెవరో సంగీతం మేష్టరు గారిని మరిగిందని తెలిసి వాళ్ల వాళ్ళు ఆ మేస్టరునీ ఆ పిల్లనీ నేలను పడేసి బండి పూజు వాళ్ళ పీకలమీద వేసి, ఆ పూజు మీదెక్కి తొక్కేసి చంపి ఎక్కడో పారేశారు. ఎన్నాళ్ళకీ పోలీసులకీ కూపీ కూడా దొరలేదు.

కానీ, ఆశ్చర్యమేమిటంటే వెంకట్రామయ్య గారు గానీ, కామరాజుగారు గానీ, కాంతమ్మగారి గురించి ఆచూకి అయినా తీయించినట్టు లేదు. వెతికి నట్టూ లేదు. కొన్నాళ్ళు పోనిచ్చి వెంకట్రామయ్య గారు కాంతమ్మ గారి అబ్బా యినీ, కూతురు రాజ్యాన్ని వాళ్ళ అమ్మమ్మ గారింటికి పంపించేసి, వాళ్ళ భూముల్ని మగతాకిచ్చేసి, ప్రతి సంవత్సరం పంట రాలుబడి అమ్మేసి వాళ్ళ అమ్మమ్మగారింటికి పంపిస్తున్నారట. ఓ పదేళ్ళు పోనిచ్చి కామరాజు ఓ రాత్రి పూట మస్తుగా తాగేసి చచ్చిపోయేడట దాసీదాని కౌగిట్లో.

ఆ కాంతమ్మగారిని తాను కొన్నాళ్లు కాంతమ్మగారూ అని పిలిచేవాడు అర్జయ్య. తర్వాత కొన్నాళ్లు కాంతమ్మ అని పిలవడం నేర్చుకున్నాడు. మరి కొన్నాళ్లకి కాంతం అని పిలిచే హోదా సంపాదించుకొన్నాడు. మరి కొన్నాళ్లు పోనిచ్చి లంజా, లమ్డీ అని అధికార పూర్వకంగా పిలిచేవాడు. కాంతానికి ఓర్పు తగ్గలేదు ఎప్పటికీ. కామరాజు మీద కసీ తగ్గలేదు. అందుకనే అర్జయ్య కోపతా పాలన్నీ సహించేది. అర్జయ్య తనకంటే కులంలో తక్కువవాడైనా నీతిగల వాడు. కొన్నాళ్లతన్ని అర్జయ్యా అని పిలిచేది కాంతమ్మ. ఆ తర్వాత్తర్వాత ''బావా'' అని పిలవడం ఎప్పుడో అలవాటు చేసుకొంది. ఓ పావుగంట క్రితం వరకూ ''బావా'' అనే పిలిచింది. ''బావా'' అనే మూలిగింది.

అలా మూలిగి మూలిగి స్పృహ తప్పిందాన్ని గదిలోంచి తెచ్చి నడవాలో కుక్కి ఈజీచైరులో పడేసి పై మీద ఓ చింకి దుప్పటి కప్పేడు అర్జయ్య. ఇంకె లాగూ తనకు కాంతం దక్కదు. దాని ఋణం నేటితో సరి. గడియో క్షణమో అది చచ్చిపోతుంది. కాంతాన్ని తాను వీధిలోకి వెంట దరిమి కొట్టి లాక్కువచ్చి నప్పుడు తన కేకలు వినీ, ఆవిడ ఏడుపు వినీ, పొరుగునున్న కొంపల్లో వాళ్లు బయటికి వచ్చి చూసి వెంటనే భయపడి పారిపోయి యిళ్లల్లో గడియలు వేసు కొని దాక్కున్నారు. అయినా తెల్లవారి పోలీసులొస్తే యిదంతా చెప్పకమానరు. వాళ్లకి కాంతం తల్లో నాలిక. వాళ్ళకి ఆవిడంటే ప్రాణం. అంచేత వాళ్ళు జరిగిం దంతా అందరికీ చెప్తారు. తనమీద ఖూనీకేసు రుజువయి పోతుంది. అందుకే కాంతం లేని యింట్లోంచి పారిపోవాలి. పారిపోవాలి!

అలా అనుకొని గడపదాటి బైటికి వచ్చినప్పుడే అర్జయ్యకు తన ఇంటి కొప్పు మీద కునకబోతూ మసకమసకగా వున్న చంద్రుడూ గడపలో ఓ మూల గుప్పు గుప్పుమని కునికిపోతున్న హరికేనులాంతరు వెలుగులో మసకమసకగా కుక్కి ఈజీచేరులో నరికిన దేవదారు మొక్కలా కునికీ బోతున్న కాంతం కనబడ్డాది. అప్పుడే ముంగిట్లో నించున్న అర్జయ్య ఒక్కసారిగా తేరుకొని కాంతాన్ని ముద్దాడి ఆగి, ఆవిడకు స్పృహ తెప్పించడానికి కడసారి ప్రయత్నాలు చేసేడు. సాధ్యపడలేదు. ఇక సాధ్యపడదు.

ఇంకిక్కడ వుండి లాభం లేదు. తానో మొకిలీసుడగాయి పోయేడు. కాంతం కడుపులో తన పాపే అయివుంటుంది – దాని ప్రాణం కూడా తీసేశాడు. వెంటనే వెళ్ళి లారీ ఓనరుగారితో చెప్పుకుంటే ఆయనేమన్నా సాయం చేస్తాడు, లేదా ఆయన వెళ్ళి పోలీసు స్టేషన్లో చెప్పుకోరా అంటే అక్కడికిపోయి అన్నీ చెప్పే సుకుంటాడు.

కట్టుకొన్న దానిని ఎంత లాలనగా చూసినా అది షోకులు మరిగి ఇరవై ఏళ్ళ క్రిందటే పట్నంలో సినిమా ప్రొప్రయిటరింటిలో తానకం వేసింది. దాన్ని చంపే ద్దామన్నంత వుక్రోషం తోనూ కొన్నాళ్లు తిరిగేడు అర్జయ్య. ఆ ప్రొప్రయిటరు

గాడి యింటి యిరుపంచలకు వెళ్తే ఓసారి తన దుమ్ము లేపేశారు. మహారాణిలా బ్రతకాల్సిన బంగారంలాంటి కాంతం అంత ఆస్తినీ, పిల్లల్నీ వదిలేసి మొగుడుమీద కసికొద్దీ పారిపోయి తనని లేవదీసుకొని వచ్చి ఇన్ని సౌఖ్యాలూ తనకిచ్చి యిలా కళ్ళు మూసేసింది... ఆ జైల్లోనే సుఖం. తనని ఉరితీసేస్తే మరీ సుఖం, అలా అర్జయ్యకనిపించి అలా ఎటో మసకవెల్తుర్లోంచి చీకట్లోకి వెళ్ళిపోయేడు.

గుప్పుమని ఒక్కసారి వెలిగి వరండాలో హరికేను లాంతరు ఆరిపోయింది. కాంతం కన్ను తెరిచింది. వాకిట్లో మసక మసక వెలుతురు కనబడింది. లోపల్నుంచి నరాలన్నీ తోడేస్తున్నాయి. కడుపులో ఏదో యినపగుండంత బరువు, తొడలూ, రొమ్మూ మరీమరీ కాల్తున్నట్టు కుంపటి మంట, తలమీద దెబ్బలు చిటచిట లాడుతున్నాయి. అర్జయ్య బావకంతా చెబ్దామని తహతహ.

''బావా! నే నే తప్పు చెయ్యలేదు. నేనే పాపమూ ఎరగను. ఇంతే జరిగింది. అది నా తప్పయితే క్షమించు'' అని చెబ్దామని వుంది. ''బావా'' అని పిలిచినట్టు తన మనసుకు అనిపించినా ఆ పిలుపు తన చెవికే వినిపించడం లేదు. తన తల మీద నుంచి కారుతున్న రక్తం మాత్రం కాస్త చల్లగా వుంది. ఇప్పుడే చెప్పాలి బావకు.

ఇన్నాళ్ళయి యీ వూరొచ్చినా తన కన్నవారిల్లు యిక్కడికి మూడు కోసుల దూరమేనని చెప్పలేదు. తానెవరి కూతురో తెలుసుకోవాల్సిన అవసరం అర్జయ్య కెప్పుడూ కలగలేదు. కామరాజుగారి పెళ్ళాం తనతో లేచి రావడమే తనకొక గొప్ప. ఆ గొప్పతనం తనకు దొరకడంతో పెళ్లాం మీద కసి తీరిపోయింది అర్జయ్య బావకి. తనకి మాత్రం తన భర్తమీద ఉక్రోషం యింకా తీరాల్సి వుంది. అందుకే ఈ అర్జయ్య బావకి ఓ కొడుకును ఇంకో మూణ్ణెలల్లో తాను ప్రసాదించబోతూంది. ఇంతలో ఈ ఘోరం జరిగిపోయింది.

బావ ఇంత అనుమానపు మనిషని తానెప్పుడూ అనుకోలేదు ఒకటి రెండు సార్లు ఆ లారీ బ్రోకరుతో తాను మాట్లాడుతున్నప్పుడు అసూయగా చూసేడు అర్జయ్య. మూడోసారి మందలించేడు. అత్తవారింట్లో ఉన్నప్పుడు కూడా తాను పాలేర్లతోనూ పనివాళ్ళతోనూ చనువుగా మాట్లాడితే ఎవరూ అంతగా పట్టించుకోలేదు. సాటివాళ్ళ దగ్గర ముభావం గానూ, తక్కువ వాళ్ళయితే చనువుగానూ ఉండడం చిన్నప్పట్నుంచీ తనకో సరదా. అది తన నైజం. అలాగే ఆ లారీ బ్రోకరుతోనూ మాట్లాడేది. దానికింత తప్పా?

అయితే బావ తనని చితగ గొడుతున్నప్పుడయినా జరిగింది జరిగినట్టు చెబ్దామనుకుంటే తనకు అభిమానం అడ్డొచ్చింది. ఈ వేళ తన పుట్టింట్లో జరిగిన అవమానం, నిరసనా అతనితో ఏఁవని చెప్పుకుంటుంది? ఇంత దగ్గరలోనే తన పుట్టింటివాళ్ళున్నారన్న సంగతి తెలిస్తే అర్జయ్య ఈ ఊరు వదిలేసి ఎక్కడికన్నా పోదామంటాడేమే! అప్పుడింక తన పుట్టింటి కబుర్లయినా తెలియకుండా పోతాయి.

అర్జయ్యా తాను ఎన్నో ఊళ్ళు తిరిగి మూడేళ్ళ క్రిందట యీ వూరొచ్చిన కొత్తల్లో ఓ విశేషం జరిగింది. ఓ సాయంత్రం ఊసుపోక యింటి ముందున్న రాదారీ బంగళావేపు వెళ్తే అక్కడెవరో నడివయసులో వున్న ఆఫీసరు వరండా మీంచి తన్నెగాదిగా చూసేడు. ఏదో మాట్లాడబోయి మానేశాడు. అతనెవరో తనక్కావలసిన వాడని తన కడుపులో పేగేదో చెప్పినట్టయింది. తాను వెంటనే ముఖం చాటుచేసుకొని ఇంటిలోకి వచ్చేసింది.

ఓ వారం రోజుల్తి రగనిచ్చి లారీ బ్రోకరు తనకో చీటీ తెచ్చి యిచ్చేడు. అది అమ్మ వ్రాసిన ఉత్తరం! ''నువ్వు బతికున్నావదే చాలు. మీ నాన్నగారూ అన్నలూ మాత్రం యింకా నీమీద కోపంగా వున్నారు. నువ్వు వాళ్లకనబడకు. అంతా చక్కబడనిచ్చి నువ్వే రావచ్చును. అందాక ఓపికపట్టు. నీ కూతురు రాజ్యం పెద్దపిల్లయింది. కొన్ని సంబంధాలు తిరిగి పోయేయి. అయినా ఏదైనా సంబంధం చూసి దానికి ముడి పెట్టేస్తాము. మా పెద్దక్క కొడుకు రాజారావిప్పుడు పెద్ద ఆఫీసరు. రాదారీ బంగళా దగ్గర నిన్నుచూచి పోల్చి నాకు రహస్యంగా కబురు పంపేడు. జాగ్రత్తగా మసులుకో. ఎప్పుడైనా డబ్బేమైనా కావలిస్తే నాకు కబురు పంపు – నేను పంపిస్తాను. బెంగపెట్టుకోకు''.

ఆ వేళ తానెంత ఏడ్చింది! అది ఏడుపో సంతోషమో తనకే తెలియలేదు.



లారీబ్రోకర్ని మాత్రం ఎంతగానో బతిమాలుకుంది. ''బాబ్బాబు! ఈ విషయం అర్జయ్యకు చెప్పకు. ఊరొదిలి పోదామంటాడు. ఈ ఉత్తరాలైనా నాకింక దక్కవు. బాబ్బాబు! నీకు పుణ్యముంటుంది'' అంటూ మరీమరీ బతిమాలింది. ''అలాగేనమ్మా'' అని అతను మాటిచ్చేడు.

ఆ తర్వాత ఈ మూడేళ్ళకి ఒకటి, రెండు, మూడు, నాలుగే ఉత్తరాలు వచ్చేయి. అందులో అన్నికష్టాలూ, సుఖాలూ ఆ ఉత్తరాల్లో అన్ని అక్షరాలూ తనకు కంఠస్తము, ఆఖరు ఉత్తరం వచ్చి ఆర్నెల్లయింది. ఆర్నెలలు. ఆరు నెలలు.

ఎప్పుడెప్పుడని ఎదురుచూస్తుండగా నిన్న ఉదయం ఎంత మంచివార్త వచ్చింది. తన కూతురు రాజ్యం... రాజ్యం పెళ్ళికార్డు వచ్చింది. పెళ్ళికార్డులో సంగతులు వివరించి చెప్పేడు లారీ బ్రోకరు.

పెళ్ళికొడుకు బాగా చదువుకొన్నవాడు. అద్దరి నెక్కడో పెద్దపేరయిన ఊళ్ళో పెద్దవాళ్ళ సంబంధం. సంప్రదాయమైన కుటుంబం. మంచి స్థితిపరులు. పెళ్ళికొడుకు లక్షణంగా ఉంటాడు. నిన్న రాత్రికే పెళ్ళి. రాజ్యం పెళ్ళి. తనకన్నవారింట్లో రాజ్యం పెళ్ళి.

రాజ్యాన్నోసారి పెళ్ళికూతురుగా చూడాలి. రాజ్యాన్ని పెళ్ళికూతుర్ని చేస్తున్నప్పుడు చూడాలి! ఈ పద్దెనిమిదేళ్ళకీ బాగా పెరిగుంటుంది పిల్ల. అమ్మమ్మ ఎంతో ఆదరంగా పోషించింది. మరి అచ్చం తనలాగే, పాతికేళ్ళ కిందట తనలాగే రాజ్యం ఇప్పుడుంటుంది. దానికి తన పోలిక రాకూడదు. తండ్రి పోలికా రాకూడదు. భగవంతుడా! మా యిద్దరి పోలికా రాకూడదు. మేనమామల పోలికొస్తే చాలును. రాజ్యం – అదీ ఓ ఇంటిదయి దూరంగా వెళ్ళిపోతుంది.

లారీల మీద బియ్యం రవాణా చెయ్యడానికి పది రోజులయి కేరళా వెళ్ళిన అర్జయ్య ఇంకారాలేదు. ఎప్పుడొస్తాడో ఏమో! అతనితో చెప్పడానికి అవకాశం లేదు. పోనీ యిరుగు పొరుగుల్లో చెబ్దామన్నా తన పుట్టింటికి మచ్చ. అసలు అర్జయ్యకు ఈ విషయం తెలియడమే మంచిదికాదు.. ఏమైనా యింకా ఒకటి రెండు రోజుల వరకూ అర్జయ్యరాడు. రాకూడదు. వెళ్ళి పెళ్ళిచూసి, రాత్రికి రాత్రే వచ్చేస్తేసరి.

నిన్న ఉదయాన్నే శుభలేఖ అందిన వెంటనే ఎవరికీ చెప్పకుండా బయల్దేరి వెళ్దామనుకుంది. కాని పుట్టింట్లో అందరి కళ్ళలోనూ పడితే గొడవవు తుంది. రాజ్యం పెళ్ళి ఆగిపోతుంది. ఏ సాయంత్రం వేళకో చేరుకుంటే ఏ పెరట్లో

నుంచో, ఏ గోడమీదనుంచో రాజ్యాంని పెళ్ళికూతురుగా చూడవచ్చును. ఈ జన్మకిక ఆ ఆనందం చాలును. ఆ సౌఖ్యం చాలును.

సాయంత్రం చీకటి పడనిచ్చి అమ్మగారి ఊరు చేరుకుంది. పాతికేళ్ళ క్రిందట ఆ ఊరెలా ఉండేదో యిప్పుడూ అలాగే ఉంది. అయితే దారిలో ఇది వరకు బడి శాల ఉండే చోట ఇప్పుడో హైస్కూలు కాబోలు బంగాళా పెంకుల్తో లేచింది. ఊళ్ళోకి ఎలక్ట్రీదీపాలు కూడా వచ్చేయి. ఎలక్ట్రీ దీపాలు వెలుతుగున్న ఆ హైస్కూలు కొత్తగా కట్టినట్లుంది. దాని ముందు తాటాకుల్తో కొత్తగా వేసిన పెద్ద పందిరుంది. ఆ పందిట్లో తివాసీలూ, జంబుకాణాలూ పరచి ఉన్నయి. అక్కడ గుంపులు గుంపులుగా చిన్నా పెద్దా పేకాట ఆడుకొంటున్నారు.

అక్కడ ఎత్తుగా వున్న హైస్కూలు అరుగుమీద ఓ మంచి ఖరీదైన కుర్చీలో ధగధగ వెలిగిపోతున్న అబ్బాయికి ఓ మంగలి రంగు రంగుల విసనకర్రతో విసురుతున్నాడు. ఎర్రటి ఆ అబ్బాయి మెడలో తెల్లటి కర్పూరపు తావళాలు న్నాయి. అతని తలకి గులాబి రంగు వాయిలు తలపాగా ఉంది. అతను పలక రంగు టెర్రీకాట్ సూట్ తొడుక్కున్నాడు. జోళ్ళు విప్పేసి స్టాకింగ్స్‌తోనే వున్నాడు ఆ అబ్బాయి, అతనే పెళ్ళికొడుకు. తన కూతురు రాజ్యం అదృష్టవం తురాలు.

గబగబా బడిదాటి పడమటికి పోయి కుడిచేతి వేపు సందులోకి తిరిగితే పెద్ద ఆవరణతో కొబ్బరి చెట్ల మధ్యను దక్షిణ తెరిపిన వున్న రెండో ఇల్లు, తన పుట్టిల్లు కనబడింది. ఇంటిముందు సింహద్వారం వెనక ఆవరణంతా ఎలక్ట్రీ దీపాల రంగు తోరణాల్లో నైపుణ్యంగా కత్తిరింపబడ్డ రంగు రంగుల కాగితాల బుట్టలు. ఆవరణ మధ్య సుమారు పాతికేళ్ళ క్రిందట తాను పెళ్ళికూతురుగా కూర్చున్న అరుగు కొత్తగా రంగురంగుల ముగ్గులతో అలంకరింపబడి ఉంది. ఆ పందిరికి నాలుగువే పులా వేసిన కుర్చీల లోనూ, బల్లలమీదా ఓ వెయ్యిమంది కూర్చో వచ్చును. ఆ పందిట్లో యిప్పుడిప్పుడే హడావుడి ఆరంభం అవుతూంది.

ముంగిట్లో ఉన్న ఆ పందిరి దాటి కుడివేపు మూలకుపోతే ఓ గుమ్మం లోపల కొంచెం చిన్నదైనా ఆవరణా, వంటశాలలూ, అది ఆడవాళ్ళు స్వేచ్ఛగా మసిలేచోటు, అమ్మ అటువేపే ఉంటుంది. లగ్నానికి ఇంకా రెండు గంటల టైముంటుంది.

రాజ్యాన్ని ఈపాటికి పెళ్ళికూతుర్ని చేసి ఉంటారు. రాజ్యం ధగధగ మెరిసి పోతూ ఉంది లక్ష్మీదేవిలా. రాజ్యాన్ని ఒక్కసారి కౌగిలించుకోవాలి. రాజ్యాన్నొక్క సారి ముద్దుపెట్టుకోవాలి. రాజ్యాన్నొక్కసారి కౌగిలించుకుని, ముద్దుపెట్టుకొని ఏడవాలి.

ఆడవాళ్ళు మసిలే ఆ ఆవరణలోకి తాను వెళ్తూంటే ఓ ముసలమ్మ అడ్డు కొంది. ''ఇప్పుడు కాదు. పొద్దుట కనబడు'' అంది. ఆవిడ తన అమ్మ.

''అమ్మా'' అని తాను పిలిచినప్పుడు గొంతులో ఏదో అడ్డం పడి నట్ల యింది. బైర్లు కమ్మబోతున్న తన కళ్ళకు అమ్మ తెల్లబోవడం తెలుస్తూనే ఉంది.

''నువ్వా! అలా పద. లోపలికి రాకు. అంతా చెడిపోతుంది'' అంటూ అమ్మ తననో మూలకు తీసుకొని పోయింది. గట్టిగా కౌగలించుకొంది. పైట చెంగుతో అమ్మ తన కళ్ళనీళ్ళు తుడుచుకొని తన కళ్ళనీళ్ళు తుడుస్తూ ''ఎవరైనా చూసేరే వీంటే దెబ్బ? కొంపలు తీసేవు'' అంది. చరచరా వంటశాల లోకి వెళ్ళి రెండు స్వీట్ పేకెట్లు పట్టుకొని వచ్చి తన చేతిలో పెట్టి అమ్మ అంది. ''వెళ్ళిపో! మీ నాన్నా వాళ్ళూ చూస్తే నిన్ను చంపేస్తారు. పారిపో''.

''అదికాదమ్మా! రాజ్యాన్ని కడసారి చూడాలని ఉంది. రాజ్యాన్ని ఒక్కసారి చూపించమ్మా'' తన గొంతు ఎలావిడిందో ఆ మాటలు అనడానికి!

''ఇప్పుడొద్దు వెళ్ళిపో? నీ నుంచి పెళ్ళి ఆగిపోతుంది'' అమ్మ ఏడుస్తూ అంది. ''ఇంకోసారి చూద్దూగానిలే. వెళ్ళిపో. అమ్మవు కాదూ'' అని పైట చెంగుతో కళ్ళు అద్దుకుంటూ అంది అమ్మ.

''ఇంకోసారి చూస్తానో లేదో! ఒక్కసారి, ఒక్కసారమ్మా'' అని అనగలిగింది తాను.

''చూసినవెంటనే వెళ్ళిపోతావా అయితే? ఉండిక్కడే ఉండు. అటూ ఇటూ తిరక్కు. ఈ గాది పక్కనే నుంచో'' అంటూ అమ్మ తనని గాది వెనక్కు లాక్కు నిపోయింది.

మరో రెండు నిమిషాల్లో అమ్మ గబగబా రాజ్యాన్ని తీసుకొని వచ్చింది. వంటశాలలోనూ, ఆ పడమటి ఆవరణలోనూ అంతా ఎవరి హడా వుడిలో వాళ్ళున్నారు. వీధి ముంగిటి ఆవరణలోంచి బాజా భజంత్రీలు వినబడుతు న్నాయి. అమ్మ వచ్చింది తన రాజ్యాన్ని తీసుకొని, బాగా ఎదిగింది రాజ్యం! నవనవలాడుతోంది రాజ్యం. లక్ష్మీదేవిలా ఉంది రాజ్యం!

గభాల్న రాజ్యాన్ని కౌగిలించేసుకొని గభాల్న రాజ్యాన్ని ముద్దు పెట్టేసు కొంది.

తన చేతిలో ఉన్న రెండు పొట్లాలూ జారి పోయేయి. ఇంతలో రాజ్యం ''ఛీ! ఛీ! ఎవర్తమ్మమ్మా ఇది?'' అని అడిగింది.

అమ్మ అంది, ''మీ అమ్మ'' అని గుసగుసగా.

రాజ్యం చివాలున వెనక్కి తిరిగి ''ఛి! ఛీ! ఇదా! ఎందుకొచ్చిందిక్కడికి'' అంటూ రుసరుసగా వెళ్ళిపోతుండగా ''ఏదర్రా పెళ్ళికూతురూ?'' అని అరుస్తూ ఓ ముసలాయన ఆ ఆవరణలోకి హడావుడిగా వస్తూ ''వేగం తెమ లండి'' అని పురమాయిస్తూ తమ వైపే వస్తున్నాడు.

కడుపులోంచి కట్టలు తెగి వస్తున్న దుఃఖం నాన్నను చూడగానే భయపడి ఆగిపోయింది. అమ్మ గాభరా పడిపోయింది.

''పో! పోవే పిచ్చిముండా! ఇక్కడకెలా వచ్చేవు? పొద్దట కనబడు. ఊ! పో!'' అని కసిరింది.

''ఎవర్తే అది?'' నాన్న గర్జించేడు.

''ఎవర్తో పిచ్చిది'' అమ్మ జవాబిస్తూనే తనని వంటశాల ఆవరణ అవతల వరకూ తరిమికొట్టింది. అంతే ....

ఆ రాత్రికి రాత్రే వచ్చేసింది. ఎలా వచ్చింది తాను? ఎలాగో వచ్చేసింది. వచ్చేసరికి గది గుమ్మం బద్దలుగొట్టి అర్జయ్య ఇంట్లో ఉన్నాడు. తనను చూడ గానే సకిలించేడు, గర్జించేడు, గాండ్రుమన్నాడు. తానేమీ పట్టించుకోలేదు.

అర్జయ్య బావకు టీ కాద్దామని స్టౌ వెలిగించింది. ఓ కప్పులో నీళ్ళు పోసి మరగబెడ్తూంది. అంతే,''ఎక్కడికెళ్ళావే లంజా'' అని వీపు మీద బలంగా గుద్దేడు. తాను సమాధానం వేరే చెప్పలేదు. ''బావా నేనేం తప్పు చెయ్యలేదు. నేనేపాపమూ ఎరగను'' అనడం తప్ప.

ఆ తర్వాత వంద ప్రశ్నలు – వంద దెబ్బలు, పేకెజీ చెక్కతో తలమీద, చేతుల మీద, జెబ్బలమీద – కాళ్ళమీద, తొడలమీద, వీపుమీద – సరుగుడు కర్రతో నడినెత్తి మీద, బర్నర్ కప్పుతో వాతలు తొడల్లోపల, రొమ్ము మీద, పొట్ట మీద – అప్పటికీ అదే సమాధానం.

పొట్టలో ఓ పేగు కదిలి ఆగిపోయింది. ఇంక తాను బతకదు.

తన కడుపులో పిల్లా బతకదు.

బావతో తన పుట్టింటి సంగతి చెప్పాలి. ఎలా? ఇంక తాను బతకదు.

ఎలా! ఎలా, ఎలా చెప్పడం, ఎలా! ఎలా!

*

*1974 (ఆంధ్రజ్యోతి దీపావళి కథల పోటీలో మొదటి బహుమతి)*

